క్లుప్తంగా

పెన్షనర్ల ధర్నాను విజయవంతం చేయండి



నిజామాబాద్‌నాగారం: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 25న కలెక్టరేట్ ఎదుట గోడుగులతో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ – రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంమోహన్ తెలిపారు. గురువారం నాందేవ్ వాడలోని సంఘ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ..ధర్నాకు అధిక సంఖ్యలో రిటైర్డు ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు దత్తాత్రేయ రావు, ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్ పాల్గొన్నారు.

'నిరుద్యోగ మహా ధర్నా'

సుభాష్‌నగర్:టీఎస్‌పీఎస్‌సీ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, లీకేజీకి బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద 25న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ చేపట్టిన నిరుద్యోగ మహాధర్నా విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య గురువారం కోరారు. పరీక్షకు సిద్ధమైన అభ్యర్థులకు రూ.లక్ష పరిహారం అందించాలని, మా నౌకరీలు మాగ్గావాలే అనే నినాదంతో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరుద్యోగ యువతతో కలిసి ధర్నా చేపడుతున్నారని పేర్కొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



డిచ్‌పల్లి: మంచిర్యాల్ జిల్లాలో ఈ నెల 25, 26, 27వ తేదీల్లో జరగబోయే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర 9వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి జేపీ గంగాధర్ పిలుపునిచ్చారు. గురువారం డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం 8 ఏళ్ల కాలంలో లాభాలు ఆర్జించే ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

బీబీసీ లియో క్లబ్ ఏర్పాటు



నిజామాబాద్ సిటీ: నగరంలోని వర్నిరోడ్డు బీబీసీ పాఠశాలలో లయన్స్ క్లబ్ సహారా ఆధ్వర్యంలో బీబీసీ లియో నిజామాబాద్ క్లబ్ ఏర్పాటైంది. ఈ సందర్భంగా జిల్లా లియో కార్యదర్శి రాం ఫణిధర్ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించగా, డిస్ట్రిక్ గవర్నర్ లక్ష్మి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం లక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే సేవా తత్వం అలవాటు చేసుకోవాలని, సేవా కార్యక్రమాలతో సమాజంలో చక్కటి గుర్తింపు వస్తుందన్నారు. బీబీసీ లియో క్లబ్ నూతన అధ్యక్షుడిగా సంజయ్, ఉపాధ్యక్షుడు దినేష్ సాయి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా లియో అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, సలహాదారుడు టి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వంజరి సంఘం ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు



నిజామాబాద్‌నాగారం: ఉగాది సంబరాలు సందర్భంగా నిజామాబాద్ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్ మాయవార్ రాజేశ్వర్ సామాజిక రంగంలో చేసిన సేవలను గుర్తించి నిజామాబాద్ వంజరి సంఘం ఆధ్వర్యంలో ఉగాది పురస్కార అవార్డు అందజేసి మెమోంటో బహూకరించి శాలువాతో ఘనంగా సత్కరించారు. నగర వంజరి సంఘం అధ్యక్షులు గంగోనే గంగాధర్, కార్యదర్శి కాలేరు సుభాష్, తదితరులు ఉన్నారు.

పార్వతీపరమేశ్వరుల కల్యాణం

డిచ్‌పల్లి: దూస్‌గాంలో నవనాథ సిద్దిరామేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న జాతర వేడుకల్లో భాగంగా గురువారం పార్వతి పరమేశ్వరుల కల్యాణ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో సర్పంచ్ శివారెడ్డి, గ్రామాభివృద్ధి అధ్యక్షులు గంగాధర్, ఉపసర్పంచ్ సురేష్, ఆలయకమిటీ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

స్వాతంత్య్ర సమరయోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతిని అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలో రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, వివిధ అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం వారి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భగత్ సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు సూచించారు. దేశ స్వాతంత్య్రం కోసం పోరాడి వారు అమరులయ్యారని, వారు చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి ఉరికంబం ఎక్కి తమ ప్రాణాలను పణంగా పెట్టారని గుర్తు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



తెయూ క్యాంపస్‌లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నేతలు, విద్యార్థులు



తెయూ క్యాంపస్ బాయ్స్ హాస్టల్‌లో ..



గద్కోల్‌లో .. ప్రజాపంథా నాయకులు



మెంట్రాజ్‌పల్లిలో .. పీవైఎల్, ఏఐకేఎంఎస్ నేతలు



నగరంలోని కోటగల్లిలో .. పీడీఎస్‌యూ నేతలు



భగత్ సింగ్ చౌరస్తాలో .. సీపీఐ నాయకులు



మోపాల్ మండల కేంద్రంలో..



నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

రవీంద్ర భారతిలో ప్రతిధ్వనించిన నిజామాబాద్ కవి స్వరాలు

నిజామాబాద్ సిటీ: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ దేవాదాయ శాఖ సంయుక్తంగా రవీంద్రభారతిలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన డాక్టర్ నాళేశ్వరం శంకరం, ఘనపురం దేవేందర్, అయినంపూడి శ్రీలక్ష్మి, కొండా రవీందర్ కవితా గానం చేశారు. ఘనపురం దేవేందర్ 'తెల్పుకో' అనే శీర్షికతో కవితా పఠనం చేయగా, డాక్టర్ నాళేశ్వరం శంకరం 'సహజీవనం' అనే కవితను వినిపించారు. అయినంపూడి శ్రీలక్ష్మి 'మిల్ ఝులి' కవితను వినిపించగా, కొండా రవీందర్ 'పల్లె కోకిల' కవితతో ఉగాదిని స్వాగతించారు. వారిని ప్రముఖులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ఘనపురం దేవేందర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



సత్కారం అందుకుంటున్న ఘనపురం దేవేందర్

మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

ఖలీల్‌వాడి: ఈ నెల 13న అర్ధరాత్రి ఇందల్‌వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రాయన్‌పల్లి గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు సీపీ కేఆర్ నాగరాజు గురువారం చెక్కులను అందజేశారు. 'పల్లర్' సంస్థ వాహనాన్ని ఆల్టోకారు ఢీకొనడంతో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మృతిచెందిన నాందేడ్ జిల్లా కొండల్‌వాడి గ్రామానికి చెందిన నీరడి గణేష్(28), నీరడి ఆదిత్య(25), అంకర్ వారి ప్రకాష్(29) లతో పాటు నిజామాబాద్ నగరానికి చెందిన బల్లే సాయిరామ్(27) కుటుంబసభ్యులకు రూ.లక్ష చొప్పున అందజేశారు.



చెక్కులను అందిస్తున్న సీపీ నాగరాజు

బోధన్ బస్టాండ్ వద్ద లైటింగ్ ప్రారంభం



లైటింగ్‌ను ప్రారంభిస్తున్న మేయర్ నీతూ కిరణ్



సరస్వతి ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని బోధన్ బస్టాండ్ వద్దగల శ్మశానవాటిక ప్రహరీ గోడ లైటింగ్‌ను గురువారం నగర మేయర్ దండు నీతూ కిరణ్ ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ.. అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా రూ. 23 లక్షల నిధులతో చేపట్టిన వాల్ బ్యూటిఫికేషన్, లైటింగ్ ను ప్రారంభించినట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ ఇద్రిస్ ఖాన్, కార్పొరేటర్లు ఖుద్దుస్, అక్బర్ హుస్సేన్, బబ్లు ఖాన్, ఎంఐఎం కార్పొరేటర్లు, నుడా డైరెక్టర్ అక్తర్ ఖాన్ పాల్గొన్నారు.

ఎన్‌జీవోస్ కాలనీలో సరస్వతి ఆలయం ప్రారంభం

నిజామాబాద్ సిటీ: నగరంలోని ఎన్‌జీవోస్ కాలనీలో గురువారం జ్ఞాన సరస్వతి ఆలయం ప్రారంభోత్సవ పూజ జరిగింది. హిందూ వాహిణి తెలంగాణ ప్రాంత సంయోజక్ ఉప్పల రాజు, నగర కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



సిరికొండ పోలీస్ స్టేషన్లో కాంగ్రెస్ నాయకులు



ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నేత ప్రీతమ్

మోపాల్/ఖలీల్‌వాడి/సిరికొండ:టీఎస్‌పీఎస్ పేపర్ లీకేజీలపై మాట్లాడిన పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి సిట్ నోటీసులు జారీ చేయడంతో జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నేతలను ముందస్తు అరెస్టులు చేశారు. కొంతమందిని స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.



మోపాల్‌లో ముప్ప గంగారెడ్డి గృహ నిర్బంధం

వాక్ స్వాతంత్య్రం అందరికీ ఉంది

ఖలీల్‌వాడి: పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష వేసిన సందర్భంగా బీజేపీ ప్రభుత్వ అణచివేతకు నిరసనగా కాంగ్రెస్ భవన్ వద్ద నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు ఆధ్వర్యంలో మౌన దీక్ష నిర్వహించారు. గురువారం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాదవ్ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు మాట్లాడుతూ.. రాజకీయాలలో అధికార ప్రతిపక్షాల నాయకులు ఎన్నో మాటలు అనుకుంటారని, వాక్ స్వాతంత్రం ఎవరికైనా ఉందన్నారు. రాహుల్ గాంధీపై వేసిన కేసును బేషరతుగా వాపసు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కాంగ్రెస్ ఆధ్వర్యంలో మోదీ దిష్టిబొమ్మ దహనం

సమాచారం..

నేడు ట్రెజరీ కార్యాలయం ఎదుట నిరసన

నిజామాబాద్‌అర్బన్: జిల్లా ట్రెజరీ కార్యాలయం ఎదుట ఐక్య ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్నట్లు సంఘం స్టీరింగ్ కమిటీ సభ్యుడు సత్యానంద్ తెలిపారు. ఎయిడెడ్ టీచర్ల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేస్తున్నట్లు వివరించారు.

జాతీయ పంచాయత్ అవార్డ్ సర్టిఫికెట్స్ ప్రదానం

సిరికొండ: మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయత్ అవార్డ్ సర్టిఫికెట్లను శుక్రవారం ప్రదానం చేయనున్నట్లు ఎంపీడీవో లక్ష్మీ ప్రసాద్ గురువారం తెలిపారు. ఎంపీపీ మాలావత్ సంగీత అధ్యక్షతన జరిగే అవార్డుల ప్రధాన సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

నడిపల్లి తైబజార్ వేలం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో మండల కేంద్రంలో నిర్వహించే వారాంతపు సంత(తై బజార్) వేలం ప్రక్రియ శుక్రవారం(24న) నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కులాచారి సతీష్‌రావు, కార్యదర్శి నిట్టు కిషన్‌రావులు గురువారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.50 వేలు డిపాజిట్ కింద గ్రామ పంచాయతీలో చెల్లించి రసీదు పొందాలని వారు సూచించారు.

తహసీల్ కార్యాలయంలో పాము

ధర్పల్లి: స్థానిక తహసీల్ కార్యాలయంలో పాము కలకలం రేపింది. గురువారం ఉదయం తహసీల్దార్ గదిని శుభ్రం చేస్తున్న సమయంలో సిబ్బందికి నాగు పాము కనిపించింది. దీంతో ఒక్కసారి సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్థానికంగా ఉన్న పాములు పట్టే వాళ్లకు సమాచారం ఇవ్వడంతో వాళ్లు వచ్చి పామును వెతికే సమయంలో గది లోపల నుంచి బయటకు వచ్చి ముళ్ల పొదల్లోకి పరిగెడుతున్న పామును చంపినట్లు సిబ్బంది తెలిపారు.

చిరుధాన్యాలతో ఎన్నో ప్రయోజనాలు



నిజామాబాద్ సిటీ: చిరుధాన్యాలు తినటం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, విద్యార్థులు తప్పనిసరిగ్గా తినటం అలవాటు చేసుకోవాలని మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి తెలిపారు. గురువారం నగరంలోని ప్రభుత్వ ఖిల్లా ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ నిజామాబాద్ ప్రాజెక్టు నిర్వహించిన పోషణ పక్వాడ్ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీవో సౌందర్య, సూపర్‌వైజర్ నందిని, ప్రధానోపాధ్యాయులు సాయన్న తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

సిరికొండ: మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగ కార్పొరేషన్ రాయితీ రుణాల కోసం ఇంటర్వ్యూలను గురువారం నిర్వహించారు. ఒక యూనిట్ కోసం 12 మంది దరఖాస్తు చేసుకోగా..ఇంటర్వ్యూలకు 12 మంది హాజరైనట్లు ఎంపీడీవో లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. ఐసీడీఎస్ ఏసీడీపీవో స్వర్ణలత, సూపర్‌వైజర్లు ప్రియదర్శిని, విజయరాణి,సూపరింటెండెంట్ లక్ష్మీపతి, సీనియర్ అసిస్టెంట్ నారాయణరెడ్డి,ఏపీఎం సత్యానంద్,బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై నిర్లక్ష్యం సరికాదు

• బీజేపీ నేత ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో కొనసాగుతున్న అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం నగరంలోని 37వ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్త చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుర్చీలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని, చిన్నారులకు ఓట్లు లేవనే దురుద్దేశంతో అంగన్‌వాడీల్లో వారికి సరైన సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. కనీస వసతులు లేక అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలతో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. టీచర్ల పక్షాన బీజేపీ పోరాడుతోందని, వారి సమస్యలు పరిష్కరించే వరకూ అండగా ఉంటుందని తెలిపారు. వెంటనే సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో నగరంలోని అంగన్‌వాడీలకు కుర్చీలు ఇవ్వడానికి ట్రస్ట్ ముందంజలో ఉంటుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

• చైర్మన్‌గా కొనసాగనున్న రవీందర్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కొట్టాల రవీందర్ రెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం గురువారం వీగిపోయింది. సొసైటీ చైర్మన్‌పై ఈ నెల 2న కొంత మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ నోటీసులు ఇచ్చారు. దీనిపై గురువారం డీసీవో సింహాచలం సొసైటీకి వచ్చి డైరెక్టర్ల అభిప్రాయాలు తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానానికి 12 మంది డైరెక్టర్లు హాజరు కాగా డీసీవో ఒక్కొక్కరి అభిప్రాయాన్ని తీసుకున్నారు. అనంతరం అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 9 మంది డైరెక్టర్లు చేతులు ఎత్తాలని డీసీవో తెలుపగా ఆరుగురు డైరెక్టర్లు అనుకూలంగా, మరో ఆరుగురు వ్యతిరేకంగా చేతులెత్తారు. దాంతో చైర్మన్ రవీందర్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని డీసీవో ప్రకటించారు. మళ్లీ అవిశ్వాస తీర్మానం ఒక సంవత్సరం వరకు ప్రవేశపెట్టడానికి వీల్లేదని తెలిపారు. రవీందర్‌కు బీజేపీ నేతలు అభినందనలు తెలిపారు.



మద్దతుగా చేతులు ఎత్తిన సొసైటీ డైరెక్టర్లు

24 గంటల్లోనే సరి చేశారు

సాక్షి ఎఫెక్ట్..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): 'ఎప్పుడు కూలుతుందో..?' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన అటెన్షన్ ప్లీజ్ కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు గురువారం స్పందించారు. ఏఈ శ్రీనివాస్ పర్యవేక్షణలో పడిపోయే దశలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని సరిచేశారు. మండలంలో విద్యుత్‌శాఖకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా.. తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. 'సాక్షి'లో వచ్చిన కథనంతో అధికారులు విద్యుత్ స్తంభాన్ని సరి చేయడంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు.

స్తంభాన్ని సరిచేసిన అధికారులు →



పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో ఓ ప్రేమ జంట మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. నందిపేట్ మండలం వెల్మల్ గ్రామానికి చెందిన నిహారిక, నందిపేట్‌కు చెందిన నితీష్ రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ నెల 15న నిజామాబాద్ లోని ఆర్యసమాజంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వేరు వేరు కులాలకు చెందిన వారు కావడంతో కుటుంబసభ్యులు బెదిరిస్తున్నారని ప్రేమ జంట పోలీసులకు తెలిపారు. ఈ విషయమై మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ప్రతాప్‌ను వివరణ కోరగా నందిపేట్ పోలీసులకు పంపించినట్లు తెలిపారు. ఈ జంట వచ్చినప్పుడు అందుబాటులో లేనని చెప్పారు.

సీపీఎం యాత్రకు కేవీపీఎస్ మద్దతు

సిరికొండ: సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న జన చైతన్య యాత్రకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సుమన్ గురువారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఈ యాత్ర ద్వారా ఎండగట్టనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని కార్మికులు, కర్షకులు, ప్రజా సంఘాలు యాత్రకు తరలిరావాలని ఆయన కోరారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	58,700	వెండి (కిలో)	70,800
22 క్యారెట్స్	54,111	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	25	క్యాప్సికం	50	70
బెండకాయ	50	70	గాజరుగడ్డ	15	30
బీరకాయ	60	80	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	25	40	దోసకాయ	15	30
బీర్నీసుకాయ	40	60	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిగడ్డ	10	20
వంకాయ	20	40	గోబిపువ్వు	20	40
పాలకూర	20	40	బీట్‌రూట్	20	40
మెంతికూర	30	50	గోరు చిక్కుడు	50	70
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	40	60
పుదీనా	30	60			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	230
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్–1– జాన్ విక్ చాప్టర్–4 – 10.15 ,4.10, 10.20
బలగం –1.20 ,7.30
స్క్రీన్–2– జాన్ విక్ చాప్టర్–4–1.10
రంగమార్తాండ–1.40,7.40,10.40
స్క్రీన్–3– దాస్ కా దమ్కీ – 10.30, 1.30, 4.30, 7.30,10.25

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1– జాన్ విక్ చాప్టర్–4(తెలుగు),12.00
జాన్ విక్ చాప్టర్–4(ఇంగ్లిష్),3.30,7.00,10.30
స్క్రీన్–2 – రంగమార్తాండ–12.05
దాస్ కా దమ్కీ–3.20 ,10.00
జాన్ విక్ చాప్టర్–4 (తెలుగు)–6.30
స్క్రీన్–3– కోస్టి –(తెలుగు)–10.20,1.20
గీతసాక్షిగా –(తెలుగు),4.05
రంగమార్తాండ –(తెలుగు)7.00,10.15
స్క్రీన్–4– తు జాతి మే మక్కర్(హిందీ),1.05
బలగం–(తెలుగు),4.35,10.20
ఫజామ్..ఫ్యూరీ ఆఫ్ ది గాడ్స్,7.25

దేవి	దాస్ కా దమ్కీ
నటరాజ్	కోస్టి (తెలుగు)
లలితామహల్	రంగమార్తాండ
విజయ్	బలగం